అదిరే గొడుగులు.. భలే రెయిన్ కోట్లు


కలర్‌ఫుల్ గొడుగు



మద్దిలపాలెం : బ్యూటిఫుల్ విశాఖ సిటీ.. కలర్‌ఫుల్ గొడుగులు, రెయిన్ కోట్లతో కళకళలాడుతోంది. వర్షాకాలం ప్రారంభమవడంతో వీటికి డిమాండ్ పెరిగింది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సప్త వర్ణాలతో కూడిన ఆకర్షణీయమైన గొడుగులు, రెయిన్ కోట్ల విక్రయాలు నగరంలో జోరుగా సాగుతున్నాయి. సిటీ సెంటర్, ప్రధాన కూడళ్లు, రహదారులు, బీచ్ రోడ్డు, ఫుట్‌పాత్‌ల వద్ద ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. వర్షంలో తడవకుండా ఉండేందుకు గొడుగులు, రెయిన్ కోట్లు రక్షణ కవచాలుగా ఉపయోగపడటంతో నగరవాసులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు వీటిని కంటికి ఇంపుగా పేర్చి అమ్మకాలు సాగిస్తున్నారు.

వర్షా కాలంలో రక్షణ కవచాలు

సీజన్‌లో భలే గిరాకీ

అన్ని సైజులు, రంగుల్లో లభ్యం

నగరంలో జోరుగా విక్రయాలు

ఆకట్టుకునే రెయిన్ కోట్లు

బడి ఈడు పిల్లలు, ద్విచక్ర వాహన చోదకులను ఆకట్టుకునేలా కలర్‌ఫుల్ రెయిన్ కోట్లను వ్యాపారులు విక్రయిస్తున్నారు. వీటి ధర రూ.150 నుంచి రూ.700 వరకు ఉంది. వీటిని ఎక్కువగా చిన్నారులు, ద్విచక్ర వాహన చోదకులు కొనుగోలు చేస్తున్నారని విక్రయదారులు చెబుతున్నారు.


బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న వివిధ రకాల రెయిన్ కోట్లు, గొడుగులు

ఆశాజనకంగా లాభాలు

తాజాగా వర్షాలు కురుస్తుండటంతో గొడుగు లేనిది బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. రెయిన్ కోట్లు కూడా వర్షంలో రక్షణగా ఉంటాయి. దీంతో సీజనల్ వ్యాపారంలో భాగంగా సాగించే గొడుగులు, రెయిన్ కోట్ల విక్రయాలు చిరు వ్యాపారులకు ఆశాజనకమైన లాభాలు అందిస్తున్నాయి. చిన్నారులు బడికి వెళ్లేందుకు గొడుగు కావాలి. వారికి సరిపడే చిన్న సైజ్ రంగురంగుల గొడుగులు అమ్ముతున్నారు. వీటితోపాటు కలర్‌ఫుల్ రెయిన్ కోట్లు విక్రయిస్తున్నారు.


అందమైన మినీ గొడుగులు

సప్తవర్ణాల గొడుగులకు గిరాకీ

పిల్లల కోసం మినీ సైజ్, పెద్దవారి కోసం పెద్ద సైజ్ గొడుగులు వ్యాపారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. చూపరులను ఆకర్షించే సప్తవర్ణాల గొడుగులకు గిరాకీ ఎక్కువగా ఉంది. పెద్ద గొడుగులు రూ.300 నుంచి రూ.600 వరకు ధరలో విక్రయిస్తున్నారు. చిన్న గొడుగులు, మహిళల గొడుగులు రూ.150 నుంచి రూ.500 వరకు ధరల్లో లభ్యమవుతున్నాయి.

సెల్‌ఫోన్‌కు రక్షణగా పాచ్‌లు

వర్షం నుంచి సెల్‌ఫోన్లకు రక్షణగా పాలిథిన్ పాచ్‌లు విక్రయిస్తున్నారు. దీనికి ఒక ట్యాగ్ కూడా ఉండటంతో పాచ్‌లో ఫోన్ పెట్టుకుని ద్విచక్ర వాహనం నడపడానికి వీలుగా ఉంటుంది. దీంతో ఇవి బాగానే అమ్ముడుపోతున్నాయి. ఎక్కువగా ఉద్యోగులు, వివిధ కంపెనీల డెలవరీ బాయ్స్ ఈ పాచ్‌లను కొంటున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గొడుగులు, రెయిన్ కోట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయంటున్నారు.


మద్దిలపాలెం - ఏయూ రోడ్డులో విక్రయిస్తున్న గొడుగులు

క్లుప్తంగా

కూటమి పాలనలో ప్రజలకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ : 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొనాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు జోడుగుళ్లపాలెంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరించడానికి 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాస్, నీరజ్‌కుమార్, సత్యవాణి, నాని, అప్పారావు, భాస్కర్, కొండమ్మ, లక్ష్మి, సుమిత్ర, కనకరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామన్నపాత్రుడు



ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంట్రెడ్డి రామన్న పాత్రుడు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీలో అనుబంధ సంఘాల నియామకం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నగరంలో తూర్పు నియోజకవర్గం పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌కు చెందిన కె.ఆర్.పాత్రుడును బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఆయన గతంలో వైఎస్సార్‌సీపీలో కీలక పదవుల్లో సేవలు అందించారు. 2016లో విశాఖ బీసీ సెల్ అధ్యక్షుడిగా, 2019లో విశాఖ పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడిగా, 2021లో రాష్ట్ర అయ్యోరకల కార్పొరేషన్ డైరెక్టర్ (బీసీ)గా, 2023లో రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. పార్టీ తనకు మంచి గుర్తింపు ఇస్తుందని, మరింత కష్టపడి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తనకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేతనాలు అందక ఎఫ్‌ఆర్‌యూ సిబ్బందికి ఇబ్బందులు

ఆరిలోవ : ఆరిలోవలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్‌ఆర్‌యూ) ఆస్పత్రిలో వేతనాలు అందక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. దీని నిర్వహణ బాధ్యతను కొన్నేళ్లుగా రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతుంది. ఆ సంస్థ తరచూ ఇక్కడి సిబ్బందికి వేతనాలు బకాయి పెట్టడం అలవాటుగా చేసుకుంది. వేతనాల గురించి సిబ్బంది అడిగినా ఫలితం ఉండదు. వారికి నచ్చినప్పుడే చెల్లిస్తుంటారు. ప్రస్తుతం మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 18 మంది సిబ్బంది ఉన్నారు. వారికి ఇంత వరకు మూడు నెలల వేతనాలు బకాయిపెట్టింది. ఇక్కడ పనిచేసే వారికి ఒక్క నెల వేతనం ఆగినా కుటుంబంపై భారం పడుతుంది. పిల్లల ఫీజులు, ఎక్కువ మంది ఇంటి అద్దెలు కట్టడానికి నానా పాట్లు పడాల్సి వస్తోంది. వేతనాలు ఇవ్వలేదని బయటకు చెప్పే సిబ్బందిని నిర్వాహకులు ఇబ్బంది పెడుతుంటారని విశ్వసనీయ సమాచారం. బకాయిపడిన వేతనాలను వెంటనే చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు.

పౌరాణిక పద్యనాటక పోటీలు నేడు

మద్దిలపాలెం : మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ 21వ నెలవారీ కార్యక్రమంలో భాగంగా పౌరాణిక పద్యనాటక పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ వ్యవస్థాపకులు వంకాయల మారుతీప్రసాద్ తెలిపారు. ఈ వేడుకల్లో స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఎం.డి.రమేష్‌కుమార్, కరాటే మాస్టర్ బి.ఆనంద్‌ను సత్కరించనున్నామని తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కురిటి సత్యం నాయుడు, మెట్ట దామోదరావు, సామవేదం బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించనున్నారన్నారు. ఈ ప్రదర్శనలకు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితురాలైన కె.శిరీషను పదమూడో వార్డులో పలువురు కార్యకర్తలు అభినందించారు. వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో ఆమెను సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనను నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా నియమించిన వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి కోసం తన పేరు ప్రతిపాదించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, పలువురు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రసంగి వాసు, పుణ్యవతి, రామారావు, అప్పలనాయుడు, విమల, కొండమ్మ, జానకిదేవి, పోలరావు, భాగ్యరాజు పాల్గొన్నారు.


శిరీషను సత్కరించి అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

బురద.. నీరు.. పర్యాటకులకు పరీక్ష


స్మార్ట్ సిటీ విశాఖలోని పాండురంగాపురం సమీపంలో బీచ్‌రోడ్డుపై నిలిచిన బురద నీరు

ఏయూ క్యాంపస్ : చిన్నపాటి వర్షం కురిసినా సముద్ర తీరంలో ఇసుక, బురద పేరకుపోతోంది. పాండురంగాపురం పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షం కారణంగా ఎత్తుగా ఉన్న ప్రాంతాల నుంచి పేరుకుపోయిన మట్టి, ఇసుక నీటితోపాటు తీరంలోకి చేరుతోంది. ఇవి బీచ్‌రోడ్డులో రోడ్లపై పేరుకుపోతున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులకు, ఫుట్‌పాత్‌లపై నడిచే వారికి ఇబ్బందిగా మారుతున్నాయి. అదేవిధంగా ఇటీవల బీచ్‌లో రోడ్డు కుంగిన ప్రాంతంలో గోడ, ఫుట్‌పాత్ నిర్మించారు. ఈ ప్రాంతంలో సరిగా పనులు నిర్వహించకపోవడంతో నీరు నిలిచిపోతోంది. నీరు సులభంగా బయటకు వెళ్లే విధంగా ఇక్కడి పరిస్థితులు లేవు. ఫలితంగా భారీగా నీరు ఇక్కడ నిలిచిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పక్కనే ఉన్న గోడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీనికి పరిష్కారం చూపే దిశగా జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


బీచ్‌రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆటపాటలతో తీరంలో సందడి

ఏయూ క్యాంపస్ : చల్లని సాయంత్రం విశాఖ వాసులను మురిపించింది. కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న నగరవాసులకు ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. దీంతోపాటు వాతావరణం కూడా చల్లబడడంతో ప్రజలు సేదతీరారు. చిన్నారులు ఇసుకలో ఆడుకుంటూ సందడి చేశారు. యువత సెల్ఫీలు, ఫొటోలకు పోజులిస్తూ కనిపించారు. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఆనందంగా గడుపుతూ నగరవాసులు సేదతీరారు.


తీరంలో ఆడుకుంటున్న పిల్లలు


పర్యాటకులతో సందడిగా బీచ్

భారీ వర్షంతో వాహనచోదకులకు ఇబ్బందులు



అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షంతో పెదగదిలి కూడలిలో చేరిన వరద నీటిలో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రోడ్లపై నీరు చేరిపోయింది. కాలువలు పొంగి ప్రవహించాయి. పలుచోట్ల చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. భారీ వర్షం కావడంతో పెదగదిలిలో బీఆర్‌టీఎస్ కూడలి జలమయమైంది. ఈ కూడలి పల్లం కావడంతో కొండవాలు నుంచి వచ్చిన వరద నీరు ఇక్కడ చిన్న కాలువల నుంచి కిందకు ప్రవహించడానికి వీలుపడక పోటెత్తింది. గంటలు తరబడి ఇక్కడ నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు సగానికి పైగా వరద నీటిలో మునిగిపోయాయి. దీంతోపాటు శ్రీకాంత్‌నగర్ కాలనీ బోర్డు వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోయింది. ఈ కాలనీ ప్రధాన రహదారిని ఆనుకుని 5వ నంబరు రోడ్డులో గాలికి ఓ వేపచెట్టు విరిగిపోయింది. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన ఈ చెట్టును స్థానికులు పక్కకు జరిపి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

ఎంవీపీ రహదారులు జలమయం

ఎంవీపీ కాలనీ : భారీ వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లు జలమయమయ్యాయి. ఏఎస్ రాజా కూడలి నుంచి నాలుగువైపుల నుంచి నీరు ముంచెత్తడంతో జలమయంగా మారింది. దీంతో ఐ హాస్పిటల్, ఇసుకతోట కూడలి, బీచ్ వైపు నుంచి వచ్చే వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సైతం జామ్ అవ్వడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎంవీపీ కాలనీలోని ఉషోదయ కూడలి నుంచి లాసన్స్‌బే కాలనీ మీదుగా బీచ్‌రోడ్డుకు వెళ్లే రోడ్డు కాలువను తలపించింది. లాసన్స్ బే కాలనీ రహదారి నీట మునగడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

ఒకేసారి భారీగా నీరు చేరడంతో పలు చోట్ల డ్రైనేజీలు మొరాయించడంతో భారీగా నీరు రోడ్లపైకి చేరింది. కొన్ని చోట్ల యూజీడీ లైన్లు ఉప్పొంగడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. రహదారులను ఆనుకుని ఉన్న షాపుల్లోకి వర్షం నీరు చేరడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా హనుమంతవాక నుంచి లాసన్స్ బే తీరం వరకు విస్తరించి ఉన్న గెడ్డ పోటెత్తింది. భారీ నీటి ప్రవాహంతో లాసన్స్ బే కాలనీ సాగరతీరం వైపు ప్రవహించింది.


శ్రీకాంత్‌నగర్‌లో గాలికి విరిగిన వేపచెట్టు

అకస్మాత్తుగా దంచికొట్టిన వర్షం

మద్దిలపాలెం : ఆకస్మాత్తుగా ఆదివారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండతో ఉక్కిరిబిక్కిరైన జనం ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షంతో ఉపశమనం పొందారు. భారీ వర్షానికి జనజీవనం కాసేపు స్తంభించిపోయింది. వాహనాల రాకపోకలకు దారులు కనిపించలేనంతగా వర్షం కురిసింది. కేఆర్‌ఎం కాలనీలో వీధులు జలమయమయ్యాయి. కాలువల్లోని చెత్త రోడ్లపైకి చేరింది. కేఆర్‌ఎం కాలనీ నుంచి ఇసుకతోట వైపు ప్రవహించే ప్రధాన కాలువలో వర్షపు నీరు చేరుకోవడంతో ప్రవాహం పెరిగింది.


ఎంవీపీ కాలనీలో జలమయమైన ఏఎస్ రాజా కూడలి రోడ్డు


వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని గెడ్డలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు


మద్దిలపాలెం కూడలిలో కురుస్తున్న వర్షం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎంవీపీకాలనీ: వెంకోజీపాలెం కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదగదిలికి చెందిన కంచు మల్లేశ్వరి(56) మృతి చెందారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివి. మల్లేశ్వరి భర్త మరణించడంతో ఆమె అల్లుడు కంచుమూర్తి మధుబాబు, కూతురుతో కలిసి పెదగదిలిలో నివాసం ఉంటోంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో ఆమెకు అనారోగ్యంగా ఉండటంతో అల్లుడు ద్వారకానగర్‌లోని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి ఇంటికి వెళ్తుండగా.. వెంకోజీపాలెం కూడలి వద్ద సీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రమాదానికి గురయ్యారు. హైవేపై వేగంగా దూసుకొచ్చిన వ్యాన్ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోగా.. వ్యాన్ మల్లేశ్వరిపై నుంచి దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్‌ను అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటనపై ఆమె అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

మల్కాపురం: తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని ఆర్‌కేపురం వద్ద తమ్మిన వరుణ్ కుమార్ (45) తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. భార్యతో మనస్పర్థలు కారణంగా వరుణ్ గత 18 ఏళ్లుగా తల్లితోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన వరుణ్‌ను తల్లి మందలించి పెద్ద కుమారుడి వద్దకు వెళ్లిపోయింది. 'తల్లి లేదు, భార్య లేదు, పిల్లలు లేరు' అని మనస్తాపానికి గురైన వరుణ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఆకట్టుకున్న పురాతన కెమెరాల ప్రదర్శన

ఏయూక్యాంపస్: జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా ఆదివారం వీఎంఆర్‌డీఏ పార్క్ ఆవరణలో ప్రదర్శించిన పురాతన కెమెరాలు ఆకట్టుకున్నాయి. వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందకు పైగా విభిన్న రకాల కెమెరాలను ప్రదర్శించారు. 1940 నుంచి నేటి వరకు ఉపయోగించిన కెమెరాలను ప్రదర్శనలో ఉంచి, వాటి ప్రత్యేకతలను సందర్శకులకు సొసైటీ ప్రతినిధులు వివరించారు. కెమెరాలను పరిశీలించిన పలువురు సందర్శకులు, వాకర్స్ వాటితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎన్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాస రెడ్డి, క్లబ్ సభ్యులు వేణుగోపాలరావు, సన్నీ, ఎస్.శ్రీనివాస రావు, రాము, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


కెమెరాల ప్రదర్శనను తిలకిస్తున్న నగర వాసులు